కథానిక

# "ఆట మొదలెట్టక ముందు—"

నిట్టల శ్రీరామమూర్తి

ఆకాశపు ఫిల్టరులోంచి నక్షత్రాలనే చిల్లుల గుండా చీకటి డికాక్షన్ దిగజారుతోంది. సెంటిమెంటు వదిలేసిన సైంటిస్టు హృదయంలా చలి కరడుగట్టి వాతావరణాన్ని దగలాగుతోంది. బయటికి వచ్చేసరికి చలిగాలి రివ్వుమని మొహాన్ని ఎదుర్కొంది. కోటు కాలరు పైకెత్తి కంఠం కప్పి పంట్లాం జేబుల్లో చేతులు పెట్టుకుని చరచర నడక సాగించేను. శ్రీనివాసయ్యరు హోటలు సమీపించగానే లోపలికి ప్రవేశించి మామూలు సీటులో చతికలబడ్డాను. వెయిటరు అరకప్పు వేడికాఫీ బల్లమీద పెట్టి వెళ్ళిపోయాడు. తాపీగా కాఫీని సేవిస్తూ పరిసరాల్ని పరీక్షించటం మొదలెట్టేను. ఓ ప్రక్కని ఇద్దరు స్నేహితులు ఒకలోయరు డివిజను క్లార్కూ ఒక అప్పరు డివిజను క్లార్కుగా దిగిపోయిన పూర్వపు డిప్టీ తాశీల్దారూ, టీ తాగుతూ తమతమ సంసార తాపత్రయాల్లో ఆఫీసు గొడవలు మేళవించి కబుర్లు చెప్పుకుంటున్నారు. ఇంకోమూల వెయిటరు వెంకటేశు కాఫీ స్వయంగా కల్పుకుని బల్లదగ్గరకూర్చుని త్రాగుతున్నాడు.

ఇంతలో గుమ్మందగ్గర గలాటా అయినంత చప్పుడైన నవ్వుల్లో కేకల్తో నలుగురు మనుష్యులు బిరబిర లోపలికి ప్రవేశించారు. పంచకట్లూ, ఒకేరకం స్వెట్టర్లూ, ఒకేరకం మఫ్లర్లూ, ఇద్దరు తలకుచుట్టుకునీ, ఇద్దరు మెడలో వేసుకునీ—వాళ్లు ఎక్కడ కూచుందామాఅని కాస్సేపు చర్చించారు. ఒకతను ఓ టేబిల్ దగ్గరకూర్చుని మిగతావాళ్ళని రమ్మని కేకేసేడు నవ్వుతూ సరదాగా. "అక్కడ కాదు ఇక్కడ కూచుందాం అన్నయ్యా" అని రెండో అతను కేకేసివాళ్ళనిఇంకో టేబిల్ దగ్గరకు పిలిచేడు. కుర్చీలూ బల్లలూ దాటి నవ్వులూ కేకలూ హడావిడితో పెళ్లికి తరలివెళ్ళేజనం రైలుపెట్టెలో చేసేహంగామాచేస్తూ అందరూ ఆఖరికి ఒక టేబిల్ దగ్గర స్థిమితపడ్డారు. ఇంతలో ఒకతను లేచి తలకుచుట్టిన మఫ్లర్ విప్పేసి, చేతులు కడుక్కునే బేసినుపైనవుండే అద్దంలో చూసుకుంటూ ఓ ఎర్రటి చిన్న దువ్వెన జేబులోనుంచి తీసి తలదువ్వటం మొదలెట్టేడు. మరో అతను నవ్వుతూ మొదటిఆసామీని సమీపించి ప్రక్కకి తోసేసి బేసినులో కాండ్రించి ఉమ్మేసి మొహం కడుక్కున్నాడు. మిగతావాళ్ళిద్దరూ లైట్లకేసీ గోడలమీద ఫోటోలకేసీ వింతగా చూస్తున్నారు. ఆఖరికి అంతా స్థిమితపడి ఒకచోటచేరి ఏవేవో ఆర్డరిచ్చారు వాళ్లు సెకండుషో సినిమాకోసం వచ్చిన పరిసరపల్లె ప్రజలని అనుకుందుకు అట్టే సేపుపట్టలేదు వాళ్ళ వాలకం చూస్తుంటే. అందులో ఒకతను తింటూ తింటూ ఎదుటి గోడమీద అద్దంలో తన ప్రతిబింబం చూసుకునిమురిసిపోతూ, చటుక్కున నేను చూస్తూండడం గమనించి సిగ్గుతో చూపు క్రిందికిదించేసుకుని ఏమీఎరగనట్లు మిగతావాళ్ళ మాటలు వింటూ వూరుకున్నాడు.

నేనుసిగరెట్టు వెలిగించి చదువుదామని న్యూస్ పేపరు బల్లమీద పరుస్తుండగా గుమ్మంలో ఇంకో ఆయన ప్రత్యక్షమయ్యాడు ఖాకీ నిక్కరూ, కంటిమెడఆకారం, పైనచాక్ నెటు వున్ని కోటూ, తలకి మఫ్లరూ, చేతిలో బాటరీలైటూ, నెరిసిన బుంగమీసాలూ, నుదురుమీద పాతబడినగాయం గుర్తూ ఆయన రిటైర్డు పోలీసు ఆఫీసరని వేరే చెప్ప నివ్వటంలేదు. ఆయన కంగారుగా బెదురు చూపుల్తో ఇటూఅటూ చూసి ఒక నిర్ణయానికి రాలేక చివరకి ఓ టేబిల్ దగ్గర కూర్చున్నాడు. మళ్ళీ అక్కడ బాగాలేదనో, లేక రోడ్డుమీద నుంచున్న అడుక్కునేవాడు కనిపిస్తున్నాడనో, ఎందుచేతోగాని అరనిమిషంలో అక్కడనుంచి చటుక్కున ప్రక్క టేబిల్ దగ్గరకి జరిగాడు ఓసారి హోటలు అంతా కలియజూసి తన్నెవరూ

చూడలేదనే ధీమాతో! కాకీ నిక్కరు చూడగానే కబుర్లు మానేసి బుద్ధిమంతులైపోయారు ముందొచ్చిన నల్గురూ. వెయిటరు వెంకటేశు మొదటి టేబిల్ దగ్గరకువచ్చి అతనిని గానక వెదకి వేసారి, రెండో చోట పట్టుకుని ఏం కావాలి అని హెచ్చరించాడు. ఆయన ఏమన్నాడో వినిపించలేదుగాని వెంకటేశు కంఠస్వరం ఆలిండియా రేడియో బజారు ధరలుచెప్పే ధోరణిలో తయారైన వంటకాల జాబితాన్ని గడగడ చదివెయ్యటం వినిపించింది. ఆయనను ఏమీతోచక ప్రక్క టేబిల్ పెద్దమనిషి పకోడీలు తినటం గమనించి పకోడీలు తెమ్మన్నాడు తన వ్యక్తిత్వాన్నీ రుచుల్నీ చంపుకుని అప్రయత్నంగా. తన ఇష్టాయిష్టాల్తో నిమిత్తంలేకుండా అవతలవాడిని అనుసరించే మనస్తత్వంగురించి నాలో చర్చించుకుంటూ ఆరిపోయిన సిగరెట్టు అవతల పారేసి క్రొత్తది ముట్టించి, కిళ్ళీదట్టించి బయలుదేరేను "మెట్రో" వైపు.

కొంతదూరం వెళ్ళేసరికి మెట్రో సినీమా మూడువైపులా భుజకీర్తుల్లా వుండే డోమ్ లైట్లు కనిపించాయి. నల్లనిచీకట్లో దూరానికి అవి దగ్గరగా ఒకదాని నొకటి చేరివున్నట్లు కనబడి ముసుగులేని ముగ్గురు వెధవముండలు ముచ్చటగా గుసగుస లాడుతున్నట్లు అనిపించింది. నేను హాల్లోకి వెళ్ళేసరికి మామూలుగానే ఇంకా జనం ఎవ్వరూరాలేదు. బాల్కనీ లో కుడిప్రక్క మూలగా నా మామూలు సీటులో కూర్చున్నాను. గేటుకీపరు దండంబెట్టి ఓనవ్వు నవ్వేడు. అతడు నాకు బాగా పరిచయం. ప్రతీ సినిమాకీ ఆఖరిరోజు రెండో ఆటకి నేను వెళ్ళటం, జనం ఆట్టే లేకపోవటం, అతనూ నేనూ మొహాలు చూసుకుంటూ కాలక్షేపంచెయ్యటం మామూలు. పైగా అతను మా "స్టేటు" టైలరుకూడాను. పగలంతా టైలరుపని చేసుకుని రాత్రి గేటుకీపరుగా తయారవుతాడు. కుర్చీలో కాళ్ళు పైకి పెట్టుకుని, ఒదిగి కూర్చున్నాను సిగరెట్టుపొగ వదుల్తూ. ఆ పొగ ఉంగరాలు తిరిగి గేటుకీపరు బట్టతలమీదుగా ప్రసరించి, అక్కడ ఆనుకోలేక జారి, బెదరి, ఎగిరిపోయింది.

కుర్చీలు చల్లగా గట్టిగా డాక్టర్ల హృదయాల్లా వున్నాయి. లైట్ల కాంతికి అవి నిగనిగ మెరుస్తున్నాయి గేటుకీపరు గొరటయ్య బట్టతలతో సమానంగా. అతను ఫాన్ వేశాడు నాకు స్పెషలుగా అన్నట్లు. "నాకేం ఫరవాలేదోయ్" అన్నట్లు నిబ్బరంగా చూచేను. అసలేచలి. అందులో ఫాన్ ఎందుకనుకుంటారేమో అది వేసినా దాని గాలి మనకి తగలని ఎత్తులో అది వుంది. కాబట్టి ఆ బాధలేదు. అదీగాక గొరటయ్యకుండే ఈ అపూర్వతెలివితేటలు అతని బొజ్జలోంచి బట్టతలవరకూ ప్రాకి అక్కడ ఏమీ ఆధారము దొరక్క అడుక్కి దిగజారిపోతున్నాయి. తన శరీరంలోవుండే ఈరెండు అవయవముల ప్రత్యేక విశేషముబట్టి తను ఇండియాలో వున్నందుకు లాయరుగానో, ఇంగ్లండులోవుంటే పట్లరుగానో ఉండవలసినవాడిననీ తన శక్తిసామర్థ్యాలు తగు అవకాశంలేక ఇలా సినీమాగేటులో నీళ్లుకారిపోతున్నాయని అతగాడి గట్టినమ్మకం.

ఇంతకీ ఆ ఫానువెయ్యటం గొరటయ్య గొప్పతనంకాదు. మనం సమయం సందర్భంలేకుండా, యిష్టాయిష్టాల్తో నిమిత్తంలేకుండా, లాంఛనప్రాయంగా అలవాటుకొద్దీ జరిపించే విశేషాల్లో అది ఒకటి. కడుపునిండినా అల్లుడికి టిఫిన్లూ పిండివంటలూ తప్పనట్లు, చలిగాలిలో ఫానువేసుకోటంకూడా ఓ సామాన్య సాధారణ అలవాటే. కొంతమంది అసలు సినీమాకురావటమే ఫార్మల్ గా వస్తారు ఫలానా గొప్పపిక్చరు తాముకూడా చూసేము సుమా అని చెప్పకుందుకీ, చూడకపోతేనామోషీ అనీ.

చల్లని ఐస్ క్రీము లోపల వేడిచేసినట్లు, బయటి చల్లదనం లోపల వెచ్చటిభావాల్ని రేకెత్తిస్తోంది. "కూర్చునేవారుంటే మేం సిద్ధంగానేవున్నాం మా తప్పేమీలేద"న్నట్లు కుర్చీలు మౌనంగా ఆహ్వానిస్తున్నాయి. గోడలు చల్లగా నిశ్శబ్దంగా వున్నాయి. మెర్క్యురీలైట్లు విధిగా వెలుగుతూనే వున్నయి. ఆ లైట్లను విసరటమేతనపని అన్నట్లు ఫాన్లు ఊరకే గిరగిరా తిరుతున్నయి. కాని అవి మండుకోటంలేదు అవధాన్లుగారూ! అందుకు మా టైలరు—కీపరు బట్టతల ఎంతమాత్రం కారణం గాదని సవినయంగా మనవిచేసుకుంటున్నాను.

దూరాన క్రింద బెంచీలమీద మానవులు కదుల్తూన్నట్లు చప్పుడయి అటుకేసిచూసేను. ఇద్దరు పెద్దమనుష్యులు ప్రక్కనే చేతిసంచీ

మూటలూ పెట్టుకుని, వాటిని దగ్గరగా కావిలించుకుంటూ చుట్టలు కాలుస్తూ కూర్చున్నారు. వారు పొరుగూరి వాళ్ళని చెప్పటం మీ రసజ్ఞతను అవమానం చెయ్యటమే అవుతుంది. వాళ్లు బజారులో సంత చూసుకుని మొదటి ఆట ఇంకో ఫిల్ము చూసి రెండో ఆటకి ఇక్కడికి వచ్చి వుంటారు. వాళ్ళ సంచీల్లో పందుంపుల్లలు ఉన్నాయనీ, సినీమా కాగానే టీస్టాలులో "డబ్బా టీ" సేవించి తమ పాత బి. యస్. ఏ. సైకిళ్ళ మీద స్వగ్రామాలకి ప్రయాణం కట్టారనీ నా నమ్మకం. మరి ఆ పందుంపుల్లలు పోతాయనో లేక చలివేసో ఆ మూటల్ని చంకదగ్గరగా చేర్చుకుని కూర్చున్నారు తెల్లని తెరకేసి తెల్ల మొహాలు వేసుకుచూస్తూ. వాళ్ళ గిరజాలు చూస్తుంటే గొరబయ్యి మూరంగా. బాల్కనీలో వుండటం వల్ల ప్రపంచ శాంతికి ఎంత క్షేమం కలిగిందో గ్రహించుకున్నాను. మధ్యమధ్యని వాళ్ల మొహాలు ఎండవైపుకి త్రిప్పి ఎగాదిగా చూస్తున్నారు స్త్రీల "ప్రత్యేకస్థలం" కేసి పాపం, సారీ, యింకా స్త్రీలోకం ప్రతినిధు లెవ్వరూ ఆఖరికి ఓ అవ్వగాని ఓ చిట్టిగాని యింకా హాజరుకాలేదు.

ఇంతలో మెల్లెక్కుతున్న చప్పుడైంది. అయితే ఈ వచ్చేది ఆడదా? మగవాడా? రూపాయి బిళ్లతీసి ఎగరేసేను. విక్టోరియారాణి వచ్చింది. ఆ మారనిరూపాయి జేబులో పెట్టేసుకుని వెనక్కి చూసేను. అమ్మాయి అందంగా వుంటుందని చెప్పలేను. ఎంచేతంటే చలికాలంలో ఏ కాంతంలో ఎంత ప్రవరుడికేనా ఏ అమ్మాయేనా అందంగానే వుంటుందని నా నమ్మకం. నాకు ఎడమవైపు వరసలో దూరంగా కుర్చీలో కూర్చుంది. ఆమె కూర్చునేలోగా మెట్లమీద జోళ్ల చప్పుడు కావటం. గబగబ ఓ మగమనిషి బాల్కనీలోకి రావటం, ఏ వస్తువుకోసమో వెతుకుతున్నట్లు గాబారాగావచ్చి గేటుదగ్గర ఆగిపోవడం ఆమెనుచూసి కుదుటబడి నా ముందు వరసలో కుర్చీలో చితికిలబడటం అంతా ఒక్క క్షణంలో జరిగిపోయింది.

"అమ్మాయీ, ఇంకా ఫిల్ము మొదలెట్టలేదు కదా" అన్న అతనిమాటలు నా పొడిదగ్గులో కలిసిపోయి నా చూపుల్తో అతని కంఠంలోనే ఆగిపోయాయి. అతనునాకు ఎందుకు సమాధానం చెప్పుకోవాలో అర్థంకాలేదు. ఆ మనిషివాలకం చూస్తే ఆమెను చాలాదూరంనుంచి వెంబడించి ఆమెకు తెలీకుండానే ఆమె అందాన్ని వెనక ఆఘ్రాణిస్తూ ఆమెతోపాటు సినిమాలో ప్రవేశించి వుంటాడనిపించింది. ఆ సమయానికేగనుక అతనిజేబులో డబ్బులేకపోతే, లేదా బాల్కనీకి కాక బెంచీకిమాత్రమే సరిపోయేడబ్బు ఉంటే అతగాడి అవస్థ ఎల్లావుంటుందో ఆభగవంతుడికే ఎరుక లేదా టీస్టాలు తిమ్మయ్యకు తెలియాలి. బాల్కనీలో స్త్రీ పురుషులకి ప్రత్యేకపు సీట్లు లేకపోయినప్పటికీ, ఆమె ఆంగ్లోయిండియన్ డ్రెస్సులోవున్నా అతను ఆమెప్రక్కని కూర్చోటానికి సాహసించలేకపోయాడు. నన్ను చూసి భయపడినట్లు నా ముందువరసలో బుద్ధిమంతుడైన బడిపిల్లాడిలా కూర్చున్నాడు. అతని ఎడ్వర్డు తలకాయ చూస్తుంటే గొరటయ్యకునికికే ప్రమాదం సంభవించే తీవ్ర పరిస్థితులు ఏర్పడేటట్లు భయమువేసింది.

ఇంతలో బాల్కనీ అలజడి వినిపించింది కామోసు బెంచీమీదవున్న ఇద్దరు పెద్దమనుష్యులూ మెడలుత్రిప్పి బాల్కనీకేసి చూసేరు. బాల్కనీ పెరపెట్ గోడ దానిమీంచి ముక్కుకు కనిపించే నామొహంవాళ్ళకి అవుపించి వుంటాయి. నన్ను ఆడదాన్నని భ్రమించి పూర్తిగా చూడ్డానికో లేదా ఇంకెవరేనా వచ్చారేమో అనో అందులో ఓ పెద్దమనిషి ఇది వరకు చూపుతో తృప్తిచెందక బెంచీమీద నుంచుని గిరజాలు సవరించుకుంటూ మాకేసి చూశాడు వెంటనే కూర్చుండిపోయి ప్రక్కవాడితో ఏదో చెప్పాడు. అతడు మమ్మల్ని మధ్యపెట్టాలని కామోసు, కాస్సేపు కూర్చున్నట్లే కూర్చుని బెంచీమీంచి ప్రక్క బెంచీలుదాటి వెళ్ళటానికనే మిషతో మా అందరికేసిచూసి కూర్చుండిపోయాడు. ఆ వెంటనే ఇద్దరూ చర్చలో దిగటం ఒకడు గట్టిగా పట్టుదలతో ఏదో అంటూంటే రెండోవాడు నసేమిరా వద్దనడం, ఈ వ్యవహారం అంతా చూస్తుంటే వాళ్లు బాల్కనీ టిక్కట్టుకు మార్చేద్దామని ఒకడూ, డబ్బు దండగ అని రెండోవాడూ వాదించుకున్నట్లు కనిపించింది. కాస్సేపటికి వాదన ఆగిపోయి వాళ్ళు కూర్చుండే మెడ

వెనక్కి త్రిప్పి దీనంగాచూసి నొప్పిచేత కాబోలు ఇంక వెనక్కి తిరగటం మానేసి నిరాశతో ఖాళీ తెరకేసి చూడటం మొదలెట్టేరు. ఇంతకీ వాళ్ళ నిరాశకి బాల్కనీ కట్టించిన ఆ కాపిటలిస్టుదే బాధ్యత.

నాకు ముందుకూర్చున్న అతను మెడ కొంచెం వెనక్కిత్రిప్పి ఆమెకేసిచూసి చటుక్కున నాకేసి చూశాడు. నేనుకూడా అతనికేసి చూడటం మానేసి ఆమెకీ మాకూ మధ్య పైగావున్న ఫాను కేసి చూశాను. అతను నాకేసి నిదానించి చూసేడు. నేను ఫానువంకబెట్టి ఆమె కేసిచూసి తనతో పోటీ చేస్తున్నాననో లేక నేను నిజంగా ఫానుకేసే చూస్తుంటే తను ఆమెకేసి చూడవచ్చుననో, ఒక్కక్షణం నాకేసి చూసి మళ్ళీ ఆమె కేసి చూసాడు. నేను ఫాన్ ఎన్నిసార్లు తిరుగుతోందో లెక్కపెట్టడం మానేసి అతనికేసి చూసేను. అతను చూపుల్తో ఆమెను నఖశిఖ పర్యంతమూ తినేసేడు. అతను మళ్ళీ నాకేసి చూసేసరికి నేను ఔంచీనీవి మనుషులికేసి చూస్తున్నాను. ఆమె మాకేసి చూసింది. అతను కుర్చీలో గిజగిజా కదుల్తాండటం చూసి ఏమిటబ్బా అని చూసేసరికి ఆమె మాకేసి చూడటం కనిపించింది. ఎంత అపరిచితవ్యక్తులేనా, స్త్రీగాని పురుషుడుగాని నిర్జనప్రదేశములో కలుసుకున్నప్పుడు (సినిమాహాలు నిర్జనప్రదేశము అన్నందుకు మెట్రోవారూ; సినీమా అభిమానులూ, ముఖ్యంగా గెరటయ్యా నన్ను క్షమించాలి) ఎప్పటికేనా పలకరించటం సహజం. ఆమె "టైము ఎంతయిందండీ" అని అడిగింది. ఆమె ఎవరిని ఉద్దేశించి అందో తెలియదు కాని అతనిమట్టుకు తననే అడిగిందనీ తనను ప్రేమించిందనీ అనుకుని వుంటాడు. కాకపోతే అతని చెవులు ఎందుకు ఎర్రబడుతాయి? అతను నావాచీ చూసి నన్ను చూడకుండా ఆమెతో టైమెంతయిందో ఎందుకు చెప్పాడు? చెప్పినవాడు ఆమె మొహం తిప్పేసుకున్నా ఇంకా అటుకేసే ఎందుకు చూస్తాడు? ఆ టైముకి అతనిచేతికి వాచీ లేకపోవటం వెస్టెండు కంపెనీవారి తప్పు లేదా, ఆఖరికి అలకపాన్పుమీదేనా వాచీ యివ్వని అతని మామగారి తప్పూ (అతనికి పెళ్లే అయివుంటే). మళ్ళీ నేను జ్ఞాపకంవచ్చి వుంటాను కామోసు నాకేసిచూసి తెరకేసి మొహం పెట్టేడు. అతను నేనంటే ఎందుకు భయపడాలో నా కర్థంకాలేదు. నేను అతడి స్నేహితుణ్ణిగాను. బావమరిదినికాను. కనీసం గురువు నేనా కాను. నా అదుపాజ్ఞలో అతను లేడు. చివరకి అతనికి చిన్నప్పుడు చదువుచెప్పిన ఎలిమెంటరీ స్కూలుమేష్టర్నేనా కాను. అతను నాకు ఫస్టు అపరిచితుడు. నా ఉనికికి అతనిపై గల ప్రభావాన్నిబట్టి సంఘానికి మానవునిపై ఎంత ప్రభావం వుందో అర్థమైంది. ఆశక్తి దానికున్నా లేకపోయినా, ఉందనుకుని బాధపడే మానవుని అనుమోదం ద్వారా అది అధికారం చలాయిస్తోంది. నేను అక్కడ ఉండటం అతనికి చాలా కష్టంగావుందని నాకు తెలుసు. కాని అతన్ని నా వెనకవరసలో కూర్చోవద్దన్నానా? నా వెనుక కుర్చీలులేక ఉట్టి గోడవుంటే నా తప్పా? అతను ఆమె ప్రక్కగా కూర్చుంటే నేను వద్దన్నానా అతనికి ఆ సాహసం లేకపోయింది గాని? ఇంతకీ నేను వెళ్ళిపోతే ఇంకా జనంరారని నమ్మకమేమిటి? వచ్చేవాళ్ళని వెళ్ళిపొమ్మని ఎల్లా చెప్పను? గెరటయ్యకు కోపంరాదూ? అంచేత ఏమయినాగానీ నేనుమాత్రం కుర్చీలోంచి కదలకూడదని నిశ్చయించుకున్నాను. అతనికి నా సీటులో తను కూర్చుంటాననీ తనసీటులో నన్ను కూర్చోమనీ అడగడానికి ధైర్యంచాలిందికాదు. నిశ్చయంలేకుండా తటపటాయించి నా ముందు కూర్చున్నందుకు అతను తనలో తిట్టుకునేవుంటాడు. శ్రీను హోటల్లో పకోడీలకి ఆర్డరిచ్చిన రిటైర్డుపోలీసుమనిషి అవస్థపట్టింది అతనికి. అతను ఒక్కసారి ఆవలించి, చేతులు తలవెనక్కిపెట్టి ఒళ్లువిరుచుకుంటూ ఆమెకేసిచూసి, నాకేసిచూడటం, నేను అతనికేసిచూడటం ఒక్కసారి జరిగింది. అతన్ని చూడనట్లు నటిద్దామనుకున్నా అతనికేసిచూడకుండా ఉండలేకపోయాను. "ఫాన్ బాగా తిరుగుతోందికదండీ" అన్నాడు అతను నన్ను ఉద్దేశిస్తూ ఫాన్ కేసి అంటే ఆమెకేసి మొహంపెట్టి.

"అవునండీ, కాని చాలా ఎత్తుగా వుంది" అన్నాను నేనుకూడా అటువేపేచూస్తూ. అతను ఫానుగురించి చాలా మాట్లాడాడు. ఇద్దరమూ ఫాను పుట్టుక, రిపేర్లు, కిమ్మత్తు, అన్నిటిగురించీ కూలంకషంగా చర్చించాము. ఇంతలో ఆమె

ముందువరసకి, పారాపెట్ గోడదగ్గిరసా రావటం తోటే అతను ఫానువిషయం మాట్లాడ్డం మానే సేడు. పాపం ఫాను అమాయకంగా అల్లా తిరు గుతూ నేవుంది.

ఇప్పుడు బెంచీమీది పెద్దమనుష్యులు కూర్చునే వెనక్కి తిరిగి ఆమెకేసి చూస్తున్నారు. అతనికి నిజంగా చాలా కోపంవచ్చింది. "చూడండీ వుట్టి బ్రూట్స్. సిగ్గులేకుండా ఎల్లా తిరిగిచూస్తు న్నారో" అన్నాడు అతను. వాళ్ళపీకనులిమే యాలనేటంత కసి కనిపించింది అతనిలో.

"అహ"అన్నాను నేను పొడిదగ్గుతూ. అతని ఆలోచనలకి బ్రేకుపడినట్లుంది. నాకేసి చూపు నిలిపి మళ్ళీ తెరకేసీ అంటే ఆమెకేసిచూసేడు.

కాని ఇదెంతోసేపుపట్టలా. ఓ లావుపాటి ఆయనా, ఎండిపోయిన రేగిఒంకలా ముడతలు పడ్డ సన్నని పొట్టి ఆవిడా, వాళ్ళ పిల్లలూవచ్చి ఆమె వెనకవరసలో కూర్చోడతోటే అతని చూపుల ట్రాఫిక్కు బందు అయిపోయింది. ఈ లోగా ఆ పిల్లలు ఇటూఅటూ పరుగులూ, ఆయన తెచ్చిన మరచెంబులోని నీళ్లు ఫ్లాస్కుమూతలో పోసుకుని త్రాగటం, గారటయ్య పిల్లల్ని లాలించి ఆవిడ వాళ్ళని కోప్పడుతూ, తే తన సినిమా యజమాని తరఫున ఫరవాలేదని ఆవిడకి నచ్చ చెప్పి వెకిలిగా నవ్వటం కొంత కాలక్షేపాన్ని యిచ్చింది సినిమా మొదలెట్టేవరకూ.

సినీమా మొదలెట్టేరు. కుర్చీలో కుర్రాడూ, ఆయన ఒళ్ళో ఆడపిల్లా నిద్రపోయారు. విశాల మైన ఆయన శరీరమేకాకుండా, టోపీతోకూడిన ఆయన తలకాయకూడా ఆమెను కనపడకుండా, చేసినందుకు అతనికి ఆయనపైన అసహ్యంవేసింది. అప్పటికే తనతల ఇటూఅటూత్రిప్పి విశ్వప్రయ త్నంచేసేడుకాని విఫలుడయ్యాడు. ఆయన టోపీ కేసి అతనుచూపుల తీక్షణంబట్టి, పోలీసవాళ్లు. కనీసం రిటైర్డుపోలీసు వుద్యోగయినా, ఏమీ అన కుండా వుంటే ఆయన తలకాయ టోపీతోసహా కోసెయ్యాలన్నంత కోపంవచ్చివుంటుంది అతనికి. అతని చూపులకేబలముంటే ఆయనమరచెంబుతో సహా ఎగిరి బెంచీలమీది పెద్దమనుష్యుల్ని చేసే వాడే. ఆఖరికి అతనికి బెంచీలమీదకూర్చుంటేసే మెరుగనిపించింది.

ఈలోగా ముగ్గురు కుర్రాళ్లువచ్చేరు. ట్వీడు పంట్లాములూ స్వెట్టర్లూ, మెడలచుట్టూ మఫ్లర్లూ, మాంచి డాబుగావచ్చారు. ఇంక తన ఫాన్సు వుట్టిదని దిగులుపడిపోయాడు అతను. వాళ్ళు సరాసరి ఆమెవెనకవరసలోచేరి, నవ్వుతూ కేకల్తో సంభాషణ సాగించారు.

ఇంతలో బాల్కనీ రెండోవైపునుంచి ఓ మొగుడూపెళ్ళాంవచ్చి కూర్చున్నారు. క్రొత్త దంపతుల్లావుంది. కొంచెం జడుస్తూ దూరదూర ముగా కూర్చున్నారు. బాల్కనీలో అందరూ తమకేసే చూస్తున్నారనే ఊహతో దగ్గిరగా చేరితే ఏం తప్పో అన్నట్లు ఎడంగా కూర్చుని ఒకరిమొహం ఒకరు అదోలాచూసుకోటం మొద లెట్టేరు.

తర్వాత రబ్బరుబంతిలాంటి చలాకీతో ఇద్దరు యువతులూ ఓ విధవావిడా (వాళ్ళ అమ్మమ్మ కాబోలు) వచ్చి నా ముందు వరసలో అతని ప్రక్కనే కూర్చున్నారు అతను కూర్చున్న కుర్చీ కిర్రు శబ్దాన్నిబట్టి అతనిహృదయం ఆశతో ఆలా పించినట్లు వినిపించింది. కాని మళ్ళీ వెంటనే సర్దుకోడంలో అమ్మాయిలు చివరసీట్లలో కూర్చో టము, అమ్మమ్మగారు అతని ప్రక్కని చేరటం వల్ల అవాంతర పరిస్థితులు ఏర్పడ్డాయి, ముస లమ్మగారు "ఇప్పుడేమంటావు?" అన్నట్లు ఒక తీవ్రదృక్కు అతనివైపు దారంకట్టిన కళ్ళజోడు లోంచి విసిరి, తెరను పరీక్షించడం ప్రారం భించింది. అతనికి ఒంటినిండా తేళ్ళూ, జెర్రులు ప్రాకినట్లయిందనుకుందును మళ్ళా చప్పుడుకాని అతని కుర్చీయే నిదర్శన. ఇంక అతనికి కుడివైపు మెడత్రిప్పే భాగ్యము లేకపోయింది.

ఫిల్ము మాంచి బిగువులోవుంది. మీరెప్పుడైనా చూశారోలేదో, సినిమాఅవుతూంటే ఫిల్ముకంటె ఫిల్ముచూసే జనంనికేసి చూస్తుంటే మాంచి సర దాగా వుంటుంది. కథలోని సీక్వెన్సుతోపాటు తన్మయత్వంచెంది, ఉద్రేకంతో సస్పెన్సుతో కుర్చీ చివరకి అనుకుని, ముందున్న కుర్చీని గట్టిగా పట్టుకుని ఉగ్గబట్టుకు చూసేవాళ్లు కొంతమంది, తెరమీద ఆడది కనిపించినప్పుడల్లా గట్టిగా సిగ రెట్టుపొగ ఊదేవాళ్లు కొందరూ, పాటకి కుర్చీ మీద వేళ్లతో మద్దెల వాయించేవాళ్లూ, కాలి జోళ్లతో నేలమీద కొట్టేవాళ్లూ ఏదోరకం,

కథతో పాటు లీనమైపోయి అందులో కష్టసుఖాలు తామూ అనుభవిస్తూ ఉండేవారు కొంతమంది, ఏ మనిషీ ఒక్క క్షణమైనా ఏపనీ చేయకుండా నిశ్చలంగా ఉండటం జరగదు. స్టంటు పిక్చర్లలో కథానాయకుడు హీరోయిన్‌ను విలన్ చేతిలోనుంచి తప్పించటానికి పంచకల్యాణిమీద పరుగులు తీసినప్పుడూ, హీరోయిన్‌ను విడిపించి విలన్‌ని చావగొట్టినప్పుడూ "హాయిహోయి బలే" అని కేకలేస్తూ ప్రక్కనున్నవాడి వీపు పచ్చడిచేసే వాళ్లనికూడా నేనెరుగుదును. సినిమా చూస్తుంటే అనిపిస్తుంది — వాస్తవికతలోనేని మనస్సులో కల్పించుకునే అసంభవ విషయాలు ఫిల్ము రూపములో చూడటం, అవే నిజమనుకుని ఆ భావాలూ ఉద్రేకాలూ, ఆశయాలూ నిత్యజీవితంలో జరిగించుకోవాలని ప్రయత్నించి నిరాశచెందటం, నేటి కుర్రకారుల స్వభావమైందని. ట్రాజెడీ ఫిల్ముల్లో విచారదృశ్యాల్ని నటించిన నటులు మిగతా అప్పుడు మామూలుగా సరదాగా ఉంటారని తెలుసుకోక, ఆవిషాదఘట్టాల్ని ఉద్రేకాల్ని మనస్సుకు పట్టించుకుని బాధపడేవాళ్ళ మనస్తత్వం యిల్లాంటిదే అనుకుంటాను.

ఇంతలో కెవ్వుమని కేకా, ఏడుపూ వినిపించాయి. పిల్లలేచి ఆరున్నొకటి ఆలాపన ప్రారంభించింది. కథ మాంచి రసపట్టులోవుంది. ఆడియన్సు తిడతారేమో అనే బాధతో పిల్లనేమీ అనలేక ఆయనచూసే నిస్సహాయ చూపూ, పిల్ల అంతకంతకూ రెచ్చిపోటం, ఫ్లాస్కు మూతలో పాలుపోసి పట్టించారు. పిల్లాడిని ఒకటికి ఆయన బయటకు తీసుకు వెళ్ళగానే ఆ కాస్త నిమిషం నాముందు అతనికి ఎంతో తెరిపి కల్గింది. చీకటి వల్ల ధైర్యం వచ్చింది కాబోలు క్రొత్తదంపతులు కాస్త దగ్గరగా జరిగినట్లున్నారు, పిల్లదాని కేకతో గబుక్కున దూరముగా జరిగి సర్దుకు కూర్చున్నారు.

ఫిల్ము సాగిపోతోంది. అప్పుడే అలవాటు పడిపోయిందో ఏమిటో నాచూపు అతనికేసే వెళ్ళింది. అతను సిదానించి తీక్షణంగా మసక వెలుగులో ఆయనటోపీ ఆవిడ సిగలోని పువ్వుల దండ మధ్యగా ఇద్దరు కుర్రాళ్ళ మెడలమధ్య సందులోంచి ఆమె వీపూ, తలకట్టూ చూస్తున్నాడు. ఫిల్ము ఆఖరి సీను వచ్చేసరికి అతను కూడా ఫిల్ము చూడటంలో మునిగిపోయాడు. ఆమె, కుర్రాళ్ళూ చటుక్కునలేచి వెళ్ళిపోయారు. అతన్ని కదిపి జ్ఞాపకంచేసి బాధపెట్ట దలుచుకోలేదు...ఫిల్ము అయిపోయింది. లైట్లు వెలిగాయి. అతను ఆమె ఖాళీసీటుకేసి ఆశ్చర్యంగా చూస్తున్నాడు. ఒక్కరొక్కరే వెళ్ళిపోయారు. అతనికి సిగరెట్టు యిస్తూ అన్నాను "షోను ఆగిపోయిందండీ" అతను జవాబు చెప్పలేదు. నేను క్రిందికి వచ్చేసరికి మెట్లమీద జోళ్ళ చప్పుడు వినిపిస్తోంది నెమ్మదిగా దిగుతున్నట్లు.

చలిదుప్పటి వెచ్చని మడతలో బయట ప్రపంచం నిద్రలోవుంది. నల్లని ఆకాశంలో నక్షత్రాలు కోమటిపిల్ల ముక్కుకు పెట్టుకున్న రవ్వల్లా మెరుస్తున్నాయి. రోడ్డుప్రక్క యిళ్ళ కిటికీల్లోంచి కోడిగ్రుడ్డు లైట్లు మసకగా వెలుగుతున్నాయి. ఆ లైట్ల వెలుగులో శాలువ మడతలో యువతీ యువకులు వెచ్చగా నిద్రబోతున్నారు. నిశ్శబ్దంలో నా భావాలసందడి, నిశీధిలో నా సిగరెట్టు వెలుగూ—ఇంటిమొహం పట్టాను.

ఉదయం ఆఫీసువేళ ఎలావుండాలో అలాగేవుంది సిటీబస్సు. లోపలిజనం పైకి రాలేరు, పైవాళ్లు లోపలికి పోలేరు. ఎలాగో వీలుచూసుకుని దూరింది కాలేజీ యువతి. ఆమెని చూడగానే అమాంతంగా లేచినిల్చుని సీటు ఖాళీ చేశాడో యువకుడు.

"నాకోసం మీరు అంత శ్రమ పడక్కరలేదు. కూర్చోండి. లేకుంటే నే ఒప్పుకోను" అన్నదామె.

"ఒప్పుకోకపోవచ్చు. కాని నేను యీ స్టాపింగులో దిగిపోతున్నాను" అన్నాడు ఆ యువకుడు.